

బంజారాహిల్స్‌లో మంగళవారం ఆహ్లాదకరమైన వాతావరణంలో విహరిస్తున్న పావురం 📷 తిగుళ్ల నాగరాజు

నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, బుధవారం 25 సెప్టెంబర్ 2024 | HYDERABAD



శేరిలింగంపల్లి నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కేటీఆర్

# నేడు ఎస్టీపీని సందర్శించనున్న కేటీఆర్

## ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి ఫతేనగర్ ఎస్టీపీ పరిశీలన

**కాంగ్రెస్ ప్రభుత్వంలో మురుగునీటి శుద్ధి కేంద్రాలపై నిర్లక్ష్యం**

**పనులన్నీ పూర్తి చేసుకున్నా ప్రారంభానికి నోచుకోని ఎస్టీపీలు**

సిటీబ్యూరో, సెప్టెంబరు 24(నమస్తే తెలంగాణ): గ్రేటర్‌లో బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు పార్టీ ఎమ్మెల్యేలతో కలిసి కూకట్‌పల్లి నియోజకవర్గంలో బుధవారం పర్యటించనున్నారు. గ్రేటర్‌కు సంబంధించిన 12 మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎమ్మెల్సీలతో కేటీఆర్ పర్యటిస్తారు. తొలుత ఫతేనగర్‌లో 133 ఎంఎల్‌డీ సామర్థ్యంతో జల మండలి నిర్మించిన మురుగునీటి శుద్ధి కేంద్రం (సీవరేజీ ట్రీట్‌మెంట్ ప్లాంట్)ను కేటీఆర్ సందర్శిస్తారు. అనంతరం, కూకట్‌పల్లి ఎస్టీపీని సందర్శించి అక్కడ నుంచి ఉదయం 11 గంటలకు స్థానిక ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు క్యాంపు కార్యాలయంలో కేటీఆర్ మాట్లాడనున్నారు. మురుగునీటి ముంపు నుంచి శాశ్వత పరిష్కారం చూపేందుకు బీఆర్‌ఎస్ బాటలు వేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం సమస్యను మరింత జటిలం చేసే తీరును ఎండగట్టనున్నారు. కాగా, బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రేటర్‌లో రోజూ ఉత్పన్నమయ్యే మురుగునీటిని వంద శాతం శుద్ధి చేయడానికి వీలుగా రూ.3866.41 కోట్ల వ్యయంతో 1259.50 ఎంఎల్‌డీ సామర్థ్యంతో 31 ఎస్టీపీలను 27 చోట్ల చేపట్టి కోకాపేట, దుర్గం చెరువు ఎస్టీపీలను అసెంబ్లీ ఎన్నికల ముందే వినియోగంలోకి తెచ్చారు. మొత్తం ఎస్టీపీ పనులను వేగవంతం చేసి ఈ ఏడాది జూన్ చివరి నాటికల్లా ప్రాజెక్టు పూర్తి ఫలాలను తీసుకురావాలన్న లక్ష్యంతో బీఆర్‌ఎస్ సర్కారు లక్ష్యాలను ఖరారు చేసింది. విడతల వారీగా అందుబాటులోకి వచ్చే ఎస్టీపీలను కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యం చేసింది. పార్లమెంట్ ఎన్నికల ముందు సిద్ధంగా ఉన్న ఆరు ఎస్టీపీలలో కేవలం మూడు ఎస్టీపీలను మాత్రమే సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఐతే, గడిచిన 10 నెలలుగా ఆ తర్వాత అధికారికంగా పురోగతిలో ఉన్న ఎస్టీపీలను ప్రభుత్వం పట్టించుకోలేదు. వందకు వంద శాతం మురుగునీటి శుద్ధి లక్ష్యానికి నీళ్లొదిలి.. కనీసం ట్రయల్ రన్ పూర్తి చేసుకొని సిద్ధంగా ఉన్న ఎస్టీపీలను అధికారికంగా ప్రారంభించలేదు. ఫలితంగా గ్రేటర్‌లో మురుగునీటి ముంపు సమస్య ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నది. మున్సిపల్, వ్యవహారాల శాఖలు తన వద్దనే ఉన్నప్పటికీ సీఎం రేవంత్‌రెడ్డి ఎస్టీపీలను సకాలంలో అందుబాటులోకి తీసుకురావడంలో విఫలం అయ్యారని పర్యావరణ వేత్తలు అభిప్రాయపడుతున్నారు.





# ఉప ఎన్నిక ఖాయం బీఆర్‌ఎస్ గెలుపు తథ్యం

**కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత • గాంధీ ఇంతకూ మీరు ఏ పార్టీ?: కేటీఆర్**

మియాపూర్ , సెప్టెంబరు 24: పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని చట్టబద్ధంగా వారిపై అనర్హత వేటు తప్పదని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. ప్రస్తుతం, ఎమ్మెల్యే గాంధీ ఏ పార్టీలో ఉన్నాడో! చెప్పుకోలేని పరిస్థితిలో ఉండగా, సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబులది తలో మాటయ్యిందని, త్వరలోనే శేరిలింగంపల్లిలో ఉప ఎన్నిక రానుందని అఖండ మెజార్టీతో గెలవబోయేదీ బీఆర్‌ఎస్ పార్టీయేనని మాజీ మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ ముఖ్య నాయకుల విస్తృత స్థాయి సమావేశం కేటీఆర్ ఆధ్వర్యంలో మంగళవారం బీఆర్‌ఎస్ భవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీఆర్‌ఎస్ పోరాటం, హైకోర్టు నోటీసుల నేపథ్యంలో ఎమ్మెల్యే గాంధీ భయపడి తాను బీఆర్‌ఎస్‌లోనే ఉన్నానని చెప్పుకుంటూనే సీఎల్పీ సమావేశానికి హాజరయ్యారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై తొమ్మిది నెలల్లోనే ప్రజలలో తీవ్రమైన వ్యతిరేక నెలకొన్నదని కేటీఆర్ అన్నారు. వారి మాటలను ప్రజలు గమనిస్తున్నారని త్వరలో తగు గుణపాఠం చెబుతున్నారన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని అన్ని డివిజన్లకు త్వరలోనే కమిటీల నియామకం పూర్తి చేస్తామని, రాబోయే ఉప ఎన్నికలతో పాటు కార్పొరేషన్ ఎన్నికలలో బీఆర్‌ఎస్‌ను ఘన విజయంతో గెలిపించేలా పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని మాజీ మంత్రి కేటీఆర్ పిలుపునిచ్చారు. నియోజకవర్గ పార్టీ శ్రేణులకు తనతో పాటు సహచర ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, మాధవరం కృష్ణారావులు ఎల్లప్పుడూ అండగా, అందుబాటులో ఉంటామని కేటీఆర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు మాధవరం రంగారావు, కొమిరిశెట్టి సాయిబాబా, సీనియర్ నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.


సోమాజిగూడలోని ప్రభుత్వోన్నత పాఠశాలను తనిఖీ చేస్తున్న కలెక్టర్ అనుదీప్

## ప్రభుత్వోన్నత పాఠశాలలో కలెక్టర్ తనిఖీ

సిటీబ్యూరో, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ): ఖైరతాబాద్‌లోని సోమాజీగూడలో ఎంఎస్ మక్త ప్రభుత్వోన్నత పాఠశాలను కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కాగా, కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించే కార్యక్రమాల వల్ల పాఠశాలలో విద్యా బోధన ఇబ్బందికరంగా మారుతుందని పలువురు స్థానికులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. సమస్యను పరిష్కరిస్తామని కలెక్టర్ వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీఈఓ రోహిణీ తదితరులు పాల్గొన్నారు.

## తరగతి గదిలోనే దేశ భవిష్యత్తు

**విద్యార్థులపై ప్రత్యేక ఫోకస్ పెట్టండి**

**ఓరియెంటేషన్‌లో హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**

సిటీబ్యూరో, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ): తరగతి గదిలోనే దేశ భవిష్యత్ నిర్మాణం జరుగుతుందని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. ప్రతి విద్యార్థి శ్రద్ధగా చదువుకుని రాణించాలని సూచించారు. ప్రభుత్వం ఒక్కో విద్యార్థిపై లక్ష రూపాయల వరకు ఖర్చు చేస్తున్నదని, అందుకు తగ్గ ఫలితం కనిపించాలని ఆయన అన్నారు. ఆలియా గోదావరి హాల్‌లో డిప్యూటీ ఈవో, డిప్యూటీ ఐఓఎస్‌లతో ఓరియెంటేషన్ కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థులపై ప్రత్యేక ఫోకస్ పెట్టాలని సూచించారు. పాఠశాల పరిస్థితులు, రికార్డు మెయింటెనెన్స్‌పై నిర్మాణాత్మక విశ్లేషణ చేయాలని చెప్పారు. పరిశీలన రిమార్కులను యాప్‌లో నమోదు చేయాలని వివరించారు. కార్యక్రమంలో డీఈఓ రోహిణి, స్టేట్ రిసోర్స్ పర్సన్ జి.విశ్వనాథ్ గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

## మోండాలో కూలిన ఓల్డ్ జైల్ ఖానా ప్రహరీ

**ఆరు టైలర్ దుకాణాలు పూర్తిగా ధ్వంసం**

**తప్పిన పెను ప్రమాదం.. ఓ టైలర్‌కు స్వల్ప గాయం**

మారేడ్‌పల్లి, సెప్టెంబర్ 24: మోండా మార్కెట్‌లోని ఓల్డ్ జైల్ ఖానా ప్రహరీ గోడ కూలడంతో, దానికి ఆనుకొని ఉన్న ఆరు టైలర్ దుకాణాలు, ఒక పూల దుకాణం పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఈ ఘటనలో ఒకరికి స్వల్ప గాయం అయ్యింది. వివరాల్లోకి వెళ్లితే.., మోండా మార్కెట్ వెనకాల ఉన్న మున్సిపల్ పురాతన భవనం మడిగెల్లో.. చాలా సంవత్సరాల నుంచి అద్దెలను చెల్లిస్తూ పలువురు టైలర్ షాపులను నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఓల్డ్ జైల్ ఖానా ప్రహరీ గోడలు పూర్తిగా తడిచి ముద్దయ్యాయి. దీంతో ఓల్ జైల్ ఖానా ప్రహరీ గోడ మంగళవారం సాయంత్రం కూలడంతో ఆ కిందనే కొనసాగుతున్న దుకాణాలపై మట్టి దిబ్బలు, రాళ్లు పడటంతో అందులో పని చేస్తున్న పలువురు ఒక్కసారిగా బయటకు వచ్చారు. ఈ క్రమంలో కృష్ణ అనే టైలర్ మాత్రం కొంత ఆలస్యంగా రావడంతో తన కాలుకు స్వల్ప గాయం అయ్యింది. దీంతో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో దుకాణాల్లో ఉన్న కుట్టు మిషన్‌లతో పాటు పలు సామగ్రి, దుస్తువులు ధ్వంసమైనట్లు షాపుల యజమానులు తెలిపారు. సమాచారం అందుకున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది, మార్కెట్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని, స్థానికంగా చుట్టు పక్కల ఉన్న దుకాణాలను ఖాళీ చేయించారు. జీహెచ్‌ఎంసీ అధికారులు జేసీబీ సహాయంతో పురాతన భవనాన్ని పూర్తిగా నేల మట్టం చేశారు. మట్టి గోడలతో నిర్మించిన పురాతన భవనాల్లో ఉన్నవారు అప్రమత్తంగా ఉండాలని జీహెచ్‌ఎంసీ అధికారులు సూచించారు.


జీహెచ్‌ఎంసీ అధికారులు తొలగించిన పురాతన భవనం

# చెరిగిన హద్దుల్ని చూపేదెలా?




## చెరువుల ఎఫ్టీఎల్, బఫర్ జోన్ల నిర్ధారణపై హెచ్ఎండీఏ మల్లగుల్లాలు!

**ఫుల్ ట్యాంక్ లెవల్‌ను ఏం చేద్దాం?**

**గడువు సమీపిస్తున్న కొద్దీ హెచ్ఎండీఏపై ఒత్తిడి భారం**

**చెరువుల నివేదిక తయారీకి హడావుడి**

*మహా నగర పరిధిలో పలు చెరువులు ఆక్రమణకు గురి కావడమే కాకుండా వాటిలో అనుమతి లేని నిర్మాణాలెన్నో వెలిశాయి. ఈ నేపథ్యంలో పలువురు పర్యావరణవేత్తలు చెరువుల పరిరక్షణపై 'జల వనరులకు ఎఫ్టీఎల్, బఫర్ జోన్లను నిర్ధారించాలి' అంటూ హైకోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో 3,532 చెరువులు ఉన్న హెచ్ఎండీఏలో 230 చెరువులకు మాత్రమే బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్‌లను నిర్ధారించారు. 2,525 చెరువులకు హద్దులను ఖరారు చేసింది. కాగా, మరో మూడు నెలల్లో 1000 చెరువులకు హద్దులను నిర్ధారించాలని హైకోర్టు హెచ్ఎండీఏను ఆదేశించింది. దీంతో గడువు సమీపిస్తున్నది. నవంబర్‌లోగా పని పూర్తి చేయాల్సి ఉంది. కాని, పనిలో మాత్రం పురోగతి కన్పించడం లేదు. కాగా, హెచ్ఎండీఏపై దినదినం ఒత్తిడి పెరుగుతూ వస్తున్నది.*

సిటీబ్యూరో, సెప్టెంబర్ 24(నమస్తే తెలంగాణ): హెచ్ఎండీఏ పరిధిలో చెరువుల ఎఫ్టీఎల్, బఫర్ జోన్ ఖరారు చేసేందుకు హెచ్ఎండీఏ అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. ఇన్నాళ్లు చోద్యం చూసిన యంత్రాంగం, హైకోర్టు అక్షింతలతో ఒత్తిడికి గురవుతున్నది. ఏడు జిల్లాల్లో విస్తరించిన హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీలోని చెరువుల సంరక్షణపై ప్రత్యేక నివేదికతో రావాలంటూ ఆదేశించడంతో అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. బఫర్ జోన్ హద్దులను చెరిపేసి ఆక్రమించుకోవడంతో చెరువుల స్వరూపం కోల్పోయింది. ఇన్నాళ్లు కనీసం బఫర్, ఎఫ్‌టీఎల్ జోన్ ప్రాంతాన్ని నిర్ధారించడంలో చేసిన నిర్లక్ష్యం కారణంగా చెరువు భూములన్నీ కబ్జాదారుల చేతుల్లోకి వెళ్లాయి. ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ పలువురు పర్యావరణవేత్తలు, సామాజిక కార్యకర్తలు ''చెరువులను రక్షించండి.. హెచ్ఎండీఏ పరిధిలో ఉన్న జల వనరులకు ఎఫ్టీఎల్, బఫర్ జోన్ నిర్ధారణ చేయండి'' అంటూ హైకోర్టును ఆశ్రయించారు. దీంతో స్పందించిన ఉన్నత న్యాయ స్థానం హెచ్ఎండీఏ పరిధిలో ఉన్న చెరువుల స్థితిగతులపై అధికారులను ప్రశ్నించింది. చెరువుల ఎఫ్టీఎల్, బఫర్ జోన్లను నవంబర్‌లోగా ఖరారు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికే ఈ అంశంపై హెచ్ఎండీఏ కమిషనర్ మూడుసార్లు ప్రత్యేకంగా సమావేశం నిర్వహించినా ప్రక్రియలో ఎలాంటి పురోగతి లేకపోవడం అధికారులను ఒత్తిడి గురి చేస్తోంది.

### హెచ్ఎండీఏలో 3,532కు పైగా చెరువులు

ఏడు జిల్లాల పరిధిలో విస్తరించిన హెచ్ఎండీఏ 3,532కి పైగా చెరువులను కలిగి ఉంది. చెరువు హద్దుల నిర్ధారణ, పర్యవేక్షణ, నిర్వహణ, పరిరక్షణ, ఆధునీకరణ కార్యకలాపాలను హెచ్ఎండీఏనే చేపడుతుంది. ఇప్పటి వరకు 2,525 చెరువులకు మాత్రమే ప్రాథమికంగా హద్దులను ఖరారు చేసింది. ఇందులో 230 చెరువులకు మాత్రమే బఫర్ జోన్, ఎఫ్టీఎల్‌ను నిర్ధారించారు. ఈ క్రమంలో చెరువుల పరిరక్షణలో కీలకమైన బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్ ఎందుకు ఖరారు చేయాలని హెచ్ఎండీఏను ప్రశ్నించి, 3 మూడు నెలల్లో మిగిలిన 1000 చెరువులకు హద్దులను నిర్ధారించాలని స్పష్టం చేసింది. కానీ, హెచ్ఎండీఏ అధికారులు ఇప్పటివరకు ఆ దిశగా అడుగులు వేయలేదు. కనీసం చెరువులు, ఎఫ్‌టీఎల్‌లో, బఫర్ జోన్‌లో ఉన్న ఆక్రమణలను ఇప్పటివరకు తేల్చలేకపోయారు. నగరంలో జలావరణాన్ని పెంపొందించే చెరువుల విషయంలో ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని హైకోర్టు హెచ్ఎండీఏపై ఘాటుగా ప్రశ్నించినా.. పరిరక్షణలో కీలకమైన హద్దుల నిర్ధారణపై హెచ్ఎండీఏ అమలు చేస్తున్న కార్యాచరణ నత్తనడకన కొనసాగుతూనే ఉన్నది.

### ఆగని కబ్జాలు, అక్రమ నిర్మాణాలు...

నగర శివార్లలో ఉన్న చెరువుల్లో యథేచ్ఛగా ఆక్రమణలు జరుగుతున్నాయి. ప్రధానంగా ఎఫ్‌టీఎల్ భూముల్లో రియల్ వ్యాపారులు భారీ నిర్మాణాలు చేపట్టారు. ఆయా చెరువు పరీవాహక ప్రాంతాల్లో వెలసిన నిర్మాణ కార్య కలాపాలను నియంత్రించేలా చెరువుకు సుమారు 20 - 30 మీటర్ల దూరంలో బఫర్ జోన్‌గా నిర్ధారించింది. మెజార్టీ చెరువుల్లో ఆక్రమణలు ఉన్నాయని, ఇటీవల హైడ్రా, ఎన్నార్‌ఎస్సీ నిర్వహించిన అధ్యయనంలో వెల్లడించింది. ప్రధాన చెరువుల పూర్తి స్థాయి నీటి సామర్థ్యం 60 శాతం మేర తగ్గినట్లుగా గుర్తించింది. కానీ, ఈ విషయాన్ని అధికారికంగా ఇప్పటికీ నిర్ధారించలేదు. దీంతో హెచ్ఎండీఏ అధికారులతో హైడ్రా కమిషనర్ ప్రత్యేకంగా సమావేశం నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లుగా తేలింది. ఈ క్రమంలో ఎంతో పకడ్బందీగా చెరువుల హద్దులను నిర్ధారణ చేయాల్సి ఉన్నా హెచ్ఎండీఏ యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నది.



# ఒంటి గంట వరకు హోటల్స్

**నిర్వహణపై నగర పోలీసులకు అంతర్గత సర్క్యులర్ జారీ**

సిటీబ్యూరో, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ): జీహెచ్‌ఎంసీ పరిధిలో మద్యం మినహా ఆహారపు సరఫరాకు సంబంధించిన ఇతర హోటల్స్‌ను అర్ధరాత్రి ఒంటి గంట వరకు తెరుచుకోవచ్చంటూ నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ అంతర్గతంగా పోలీస్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సర్క్యులర్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. హైదరాబాద్‌లో రాత్రి 10 గంటలకే దుకాణాలు మూసేస్తూ ప్రజలపై లాఠీ ఛార్జీ చేస్తున్నారని, ఇటీవల పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలోనే సీఎం అర్ధరాత్రి ట్రై కమిషనరేట్ల పరిధిలో దుకాణాలు తెరుకోవచ్చంటూ ఆదేశించిన విషయం తెలిసిందే. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ మంగళవారం దుకాణాలు తెరిచే విషయంలో సిబ్బందికి అంతర్గతంగా సర్క్యులర్ జారీ చేసినట్లు సమాచారం. సర్క్యులర్‌లోని అంశాలు ఇలా..

- బట్టలు, జ్యువెలరీ దుకాణాలు, సూపర్ మార్కెట్లు, ఎలక్ట్రానిక్ షాప్స్, సెల్ ఫోన్ షాప్స్, జనరల్ అండ్ కిరాణా స్టోర్స్ బుక్ స్టాల్స్ ఉదయం 9 నుంచి రాత్రి 11 గంటల వరకు తెరిచి ఉంటాయి.
- మద్యం దుకాణాలు జీహెచ్‌ఎంసీ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు తెరుచుకోవచ్చు. జీహెచ్‌ఎంసీ పరిధితో పాటు జీహెచ్‌ఎంసీకి 5 కిలోమీటర్ల వరకు ఉన్న ప్రాంతాలలోని బార్లు(2బీ)లలో మద్యం సరఫరా చేయడానికి మాత్రం ఉదయం 10 నుంచి రాత్రి 12 గంటల వరకు (పని దినాలలో), వీకెండ్స్ (శుక్ర, శనివారాలలో) రాత్రి 10 గంటల నుంచి అర్ధరాత్రి ఒంటి గంట వరకు అనుమతి ఉంటుంది.
- ఆహారపు విక్రయాలకు సంబంధించిన దుకాణాలు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉదయం 5 గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు తెరుచుకోవచ్చు. అయితే హోటల్స్, రెస్టారెంట్స్, దాబా, ఐస్‌క్రీమ్ పార్లర్స్, బేకరీస్, టిఫిన్ సెంటర్స్, కాఫీ షాప్స్, టీ స్టాల్స్, పాన్ షాప్స్ ఒంటి గంట వరకు తెరుచుకోవచ్చని సూచించారు. ఈ ఆదేశాలు ప్రభుత్వం నుంచి అధికారికంగా రావాల్సి ఉందని పేర్కొన్నారు.


రామంతాపూర్ పబ్లిక్ స్కూల్ ఇందిరానగర్, నెహ్రూనగర్‌లలో పర్యటించిన జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి

# పారిశుధ్యం సజావుగా..

**క్షేత్రస్థాయి పర్యటనలో కమిషనర్ ఆమ్రపాలి కాట**

సిటీబ్యూరో, సెప్టెంబరు 24(నమస్తే తెలంగాణ): నగరంలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున పారిశుధ్య కార్యక్రమాలు సజావుగా జరిగేలా చర్యలు చేపట్టాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి కాట అధికారులను ఆదేశించారు. కమిషనర్ ఆమ్రపాలి ఎల్బీనగర్ జోన్‌లోని పలు ప్రాంతాల్లో మంగళవారం ఆకస్మికంగా పర్యటించి శానిటేషన్ నిర్వహణ, రోడ్లపై పాట్‌హోల్స్, రోడ్ల స్థితి గతులను పరిశీలించారు. సరూర్‌నగర్ నుంచి ఎల్బీనగర్, నాగోల్ మీదుగా ఉప్పల్ భగాయత్, ఉప్పల్ స్టేడియం రోడ్డు ప్రాంతాల్లో పర్యటించి రోడ్డు మరమ్మతులు, శానిటేషన్‌పై తీసుకోవాల్సిన సత్వర చర్యలపై ఆమె సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. సరూర్‌నగర్, ఉప్పల్, రామంతాపూర్ చెరువులను సందర్శించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వరుసగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో అధికారులంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. రోడ్లపై ఏర్పడిన గుంతలను పూడ్చి వేయాలన్నారు. కమిషనర్ వెంట ఎల్బీనగర్ జెడ్సీ, డీసీలు, అధికారులు పాల్గొన్నారు.

### నీరు నిల్వకుండా చేద్దాం

ఇటీవల వరుసగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల్లో వరద నీరు నిలువకుండా శాశ్వత పరిష్కారం చేయాలని కమిషనర్ ఆమ్రపాలి అధికారులను ఆదేశించారు. ఏసీలు, జెడ్సీలు, ఇతర విభాగాల హెచ్‌ఓడీలతో ఆమె టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. నగరంలో కొన్ని ప్రాంతా ల్లో వర్షాలకు లో తట్టు ప్రాంతాల్లో వరద నీరు నిలిచి కాలనీవాసులకు ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో వరద నీరు లేకుండా శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, ఇంజినీరింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో నివేదిక అందజేయాల ఆదేశించారు.

# విరుచుకుపడిన వరుణుడు

## దంచికొట్టిన వాన.. లోతట్టు ప్రాంతాలు జలమయం

సిటీబ్యూరో, సెప్టెంబర్ 24(నమస్తే తెలంగాణ): నగరంలో పలు ప్రాంతాల్లో మంగళవారం వరుణుడు విరుచుకుపడ్డాడు. ఆకాశానికి చిల్లు పడిందా..! అన్నట్టుగా రెండు నుంచి మూడు గంటలు ఈదురు గాలుల బీభత్సంతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. రోడ్లన్నీ నదులను తలపించాయి. నాలాలు పొంగిపొర్లాయి. ప్రధానంగా ఉప్పల్, హబ్సిగూడ, తార్నాక, సికింద్రాబాద్, అమీర్‌పేట, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, కొండాపూర్, మాదాపూర్, మియాపూర్ తదితర ప్రాంతాల్లో ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. ఈదురు గాలుల బీభత్సానికి పలు ప్రాంతాల్లో చెట్లు విరిగిపడ్డాయి. మొత్తంగా ట్రాఫిక్ జాం వాహనదారులకు తీవ్ర నరకాన్ని చవి చూపించాయి. సముద్ర మట్టానికి 5.8 కిలో మీటర్ల ఎత్తులో ఆవర్తనం కొనసాగుతుందని, దీని ప్రభావంతో రాగల 24 గంటల్లో పశ్చిమ, మధ్య బంగాళఖాతం, దాని పరిసర ప్రాంతాల్లో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. దీని ప్రభావంతో నగరంలోని పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు.

### స్తంభించిన ట్రాఫిక్..!

భారీ వర్షం కారణంగా నగరంలో ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఎక్కడికక్కడే వాహనాలు నిలిచిపోయాయి. రోడ్లన్నీ జలమయం కావడంతో వాహనాలు కదల్లేకపోయాయి. నాలాలు పొంగి పొర్లుతుండటంతో వాటిని దాటడానికి వాహనదారులు బెంబేలెత్తారు. ఓ వైపు వర్షం.. మరోవైపు కదల్లేని వాహనాలతో రోడ్డుపైనే తడుస్తూ వాహనదారులు నరకం చూశారు. ప్రధానంగా బేగంపేట, బంజారాహిల్స్, ఐటీ కారిడార్ తదితర ప్రాంతాల్లో వాహనాలు కిలో మీటర్ల మేర నిలిచిపోయాయి.


**వరద పొంగింది రోడ్డు మునిగింది** | భారీగా కురిసిన వర్షానికి మన్సూరాబాద్ డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల సముదాయాల నుంచి ఆనంద్‌నగర్ చౌరస్తాకు వెళ్లే మార్గంలో జలమయంగా మారిన రోడ్డు